

సజావుగా సంక్రాంతి

ప్రజలకు హాని కలిగించే అసాంఘిక శక్తులను చెక్ పెట్టేందుకు జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన ప్రణాళికలు సత్ఫలితాలనిచ్చాయి.

- 8లో



175/175 సీట్ల గెలుపే లక్ష్యం

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రణాళికలు రచిస్తోంది.

- 8లో



పొగమంచు కష్టాలు

రేగిడి: పొగమంచు గురువారం ఉదయం 8 గంటల వరకు కురిసింది. ప్రయాణానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనచోదకులు లైట్లు వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు.

అగ్రిపథాన అతివలు

చదువుకున్నవారు ఎవరైనా కడుపులో చల్ల కదలకుండా ఉండే ఉద్యోగాన్ని కోరుకోవడం సహజం. మహిళలైతే కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగాలనే ఎంపిక చేసుకోవడం పరిపాటి. కానీ.. వీరు అలాకాదు. చెట్టూపుట్టా దాటుకుంటూ పొలాల్లో తిరుగుతూ పనిచేసేందుకు ఇష్టపడుతున్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ 'రాణి'స్తామని నిరూపిస్తున్నారు. ఇబ్బందులకు మారుపేరైన వ్యవసాయరంగలోనూ దూసుకుపోతున్నారు. విత్తన సరఫరా నుంచి పంట చేతికొచ్చే వరకు రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. సాగును లాభాలబాట పట్టించడంలో తమదైన ముద్రవేస్తున్నారు. మహిళా వీహెచ్‌ఏలు, వీఏఏల సాగు కృషికి 'సాక్షి' అక్షర రూపం.

- రైతులకు చేదోడువాదోడుగా నిలుస్తున్న మహిళా వీహెచ్‌ఏలు, వీఏఏలు
- ఉత్సాహంగా విధి నిర్వహణ
- వ్యవసాయాధికారులుగా రాణింపు
- రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్న మహిళా వ్యవసాయ, ఉద్యానవన ఉద్యోగులు



గొల్లలపేటలో వేపాకు కషాయం తయారీ విధానాన్ని రైతులకు తెలియజేస్తున్న వీఏఏ లావణ్య (ఫైల్)

రామభద్రపురం:

వ్యవసాయం అంటే.. ఓ వ్యాపకం. ఎండా వానా లెక్కచేయకుండా.. ఆరుగాలం పొలంలో శ్రమించాలి. పంట విత్తిన నుంచి మార్కెట్‌కు తరలించేవరకు ప్రతీ పనిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. ఇష్టంగా సాగాలి. సీజన్‌వారీగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పేమాట. దీనిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాలా ఆచరణలోకి తెచ్చింది. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ఏటా ఠంచన్‌గా పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచేలా గ్రామ స్థాయిలో ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. సుమారు ఐదేళ్లుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తన సరఫరానుంచి పంట విక్రయం వరకు చేదోడువాదోడును అందిస్తోంది. వ్యవసాయ సిబ్బంది కృషితో ప్రభుత్వ ఆశయం నెరవేరుతోంది.

జిల్లా	పనిచేస్తున్న వీహెచ్‌ఏలు, వీఏఏలు	వీరిలో మహిళలు
పార్వతీపురం మన్యం	412	164
విజయనగరం	472	250

రైతన్నకు అండగా...

ఐదేళ్ల కిందటి వరకూ వ్యవసాయ శాఖలో ఉద్యోగమంటేనే యువతులు, మహిళలు ఆమడ దూరాన ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలవాలన్న ఉద్దేశంతో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకుల పోస్టులను భర్తీచేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 40–50 శాతం పోస్టులను మహిళలే సొంతం చేసుకున్నారు. విధుల్లో ఉత్సాహంగా సాగుతూ... రైతులను సాగులో చైతన్యపరుస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే సాగు పద్ధతులను విడమర్చి చెబుతున్నారు. ఏ సీజన్‌లో ఏ పంట వేయాలో క్యాలెండర్ ప్రకారం వివరిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వివరాలు తెలియజేస్తున్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలను శాస్త్రోక్తంగా వివరిస్తున్నారు. పంటలను ఆశించే చీడపీడలను నివారించే కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా తెలియజేస్తున్నారు. విపత్తుల వేళ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లి పంటను రక్షించే చర్యలపై సూచనలిస్తున్నారు. అందరికీ అన్నంపెట్టే రైతన్నకు సేవచేయడంలో అసలైన ఆత్మసంతృప్తి ఉందని, అందుకే... ప్రభుత్వం కల్పించిన ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని సంతోషంగా చెబుతున్నారు.



అప్పలరాజుపేటలో రైతుకు ఈకేవైసీ చేస్తున్న లావణ్య

ఇదో గొప్ప అవకాశం..



మాది పార్వతీపురం మన్య జిల్లా సీతానగరం మండలంలోని ఇప్పలవలస. వ్యవసాయ కుటుంబం. వ్యవసారంగం అంటే మక్కువ. రైతన్నకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో హార్టికల్చర్ విభాగంలో డిప్లమో చేశాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భర్తీచేసిన గ్రామ ఉద్యాన సహాకుల నియామకాల్లో గ్రామ ఉద్యానశాఖ సహాయకురాలి(వీహెచ్‌ఏ)గా ఉద్యోగం పొందాను. ఇదే మొదటి ఉద్యోగం కావడంతో సవాలుగా తీసుకున్నాను. రైతన్నకు సేవ చేసేందుకు గొప్ప అవకాశం వచ్చిందనుకున్నా. రామభద్రపురం మండలం కొట్టక్కి ఆర్‌బీకేలో పోస్టింగ్ వచ్చింది. అధికారుల సూచనల మేరకు పొలాలకు వెళ్లి రైతన్నకు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నాను. పుస్తకాల్లో ఉన్న శాస్త్రోక్త పద్ధతులను విడమర్చి చెబుతున్నా. నేను ఇచ్చే సలహాలు పాటించడం వల్ల పంట కలిసివచ్చే సమయంలో ఆ రైతులు తమపై చూపే అభిమానం వెలకట్టలేనిది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నా.

– యు.స్వాతి, గ్రామ ఉద్యాన సహాయకురాలు, కొట్టక్కి

సాగుపై మక్కువ కలిగేలా...



నేను హార్టికల్చర్ బీఎస్సీ చేశాను. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో ఈ రంగంపై అవగాహన ఉంది. ఆరికతోట ఆర్‌బీకేలో ఉద్యోగం రాగానే ఆనందం కలిగింది. ఫీల్డ్‌కు వెళ్లినప్పుడు 10 నుంచి 50 మంది రైతులను కలుస్తాను. సాగుపై ఆసక్తి కలిగేలా సూచనలు ఇస్తుంటాను. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే మార్గాలు సూచిస్తుంటాను. పనిలో నిజాయితీ ఉన్న రైతులు మా మాటలు బాగా ఒంటబట్టించుకుంటారు. రైతులకు సహాయపడడంలో ఉద్యోగపరంగా సంతృప్తిగా ఉంది.

– కేతిరెడ్డి సంధ్య, గ్రామ ఉద్యానసహాయకురాలు, ఆరికతోట

కష్టమైనా ఇష్టపడే వచ్చా...



నేను రొంపల్లి ఆర్‌బీకేలో పనిచేస్తున్నాను. 2019లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దయతో గ్రామ వ్యవసాయ సహాయకురాలిగా ఉద్యోగం పొందాను. ఇష్టపడిన వ్యవసాయ రంగంలో పోస్టు రాగేనే చాలా సంతోషం కలిగింది. రైతుకు సేవ చేయడానికి దొరికిన అవకాశంగా ఫీలవుతున్నాను. రైతులు ఎంతో కష్టపడితేనే మనమంతా ఇంత సుఖమైన జీవితం అనుభవిస్తున్నామని తెలుసుకోవాలి. అటువంటి వారికి తోడ్పడుతుంటే చాలా తృప్తిగా ఉంటుంది. ఈ రంగంలో మగవారితో దీటుగా పని చేయాలనే దీక్షతో పనిచేస్తున్నా. ఫీల్డ్‌లో రైతులను కలిసి వారికి అర్థమయ్యే వరకు ఓపికగా సాగుపై అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వం కల్పించిన ఉద్యోగం ఆత్మసంతృప్తినిస్తోంది.

– కె.విజయలక్ష్మి, వ్యవసాయ సహాయకురాలు, దుప్పలపూడి



రామభద్రపురంలో పొట్టి చిక్కుడు సాగు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న హైమావతి (ఫైల్)



రొంపల్లిలో రైతుల ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేయిస్తున్న వీఏఏ శాంతి (ఫైల్)



మిర్తివలసలో కోకో గ్రేడింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వీహెచ్‌ఏ స్వాతి (ఫైల్)

న్యూస్‌రీల్

వైభవంగా పార్వేట ఉత్సవం



ఉత్సవమూర్తులను తిరువీధిగా తీసుకెళ్తున్న భక్తులు

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలో వేణుగోపాలస్వామివారి పార్వేట ఉత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫనిహారం సీతారామాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఉత్సవమూర్తులను తిరువీధి జరిపారు.

సురక్షిత ప్రయాణ బాధ్యత డ్రైవర్లదే

- ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: రోడ్డు రవాణాలో ప్రమాదరహిత, సురక్షిత ప్రయాణానికి డ్రైవర్లు కీలక బాధ్యత వహించాలని ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు అన్నారు. రహదారి భద్రతామాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ స్టాఫ్‌శిక్షణ కళాశాలలో డ్రైవర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్స్‌కు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణ సమయంలో ప్రశాంతత పాటిస్తే ప్రమాదరహిత రవాణా సేవలను అందించగలుగుతామని సూచించారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి ఈనెల 24 వరకు బస్సుల నిర్వహణ, 25 నుంచి 28 వరకు ఫ్యామిలీ కౌన్సెలింగ్, 29 నుంచి 31వ తేదీ వరకు సెఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్, వచ్చే నెల 1 నుంచి 5 వరకు వైద్య పరీక్షలు, 6 నుంచి 19వ తేదీ వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, 10న రక్తదాన శిబిరం, 11 నుంచి 13 వరకు ప్రమాదాలపై ఆడిట్, 14న ఉత్తమ డ్రైవర్ల అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. ఈనెల 24న డ్రైవర్స్ డే ఉత్సవాలను అన్ని డిపో కేంద్రాలు, బస్ స్టేషన్‌లలో నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమంలో జోన్–1 పరిధిలోని డ్రైవర్లు, మెకానిక్స్, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

శాంతియుత జీవనమే శ్రేయస్కరం



లక్ష్మీపేటలో దళితులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓ

వంగర: ప్రజలు శాంతియుతంగా జీవించాలని ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి కోరారు. మండలంలోని లక్ష్మీపేటను గురువారం సందర్శించారు. మూడు రోజుల కిందట ఎస్సీ, బీసీ వర్గీయుల మధ్య జరిగిన తగాదాలో నమోదైన అట్రాసిటీ కేసు అంశంపై ఇప్పటికే డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓలు గ్రామాన్ని సందర్శించారు. ఘటనకు గల కారణాలను బాధితుడు చిత్తిరి దుర్గాప్రసాద్‌ను అడిగితెలుసుకున్నారు. 2012లో తమ గ్రామంలో జరిగిన ఘటన అనంతరం నాలుగు కుటుంబాలకు చెందినవారు ఉద్యోగాలకు దూరమయ్యారని, ఉపాధి పొందేందుకు కొంత భూమిని కేటాయించాలని దళితులు కోరారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన కోర్టు భవనాలు, ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్‌ఐ వై.వి.జనార్దన్ పాల్గొన్నారు.

23న దేవాలయ భూములకు వేలం

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ద్వాదశ దేవాలయ భూముల ఫలసాయం మూడేళ్లు అనుభవించడానికి ఈనెల 23న ఆలయ ఆవరణలో వేలం వేయనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ద లక్ష్మీనగేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు దేవాలయ ప్రాంగణంలో 38.48 ఎకరాల భూములకు సంబంధించి వేలం వేస్తామన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపు



విజయనగరం: సామాజిక సమతామూర్తి, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని విజయవాడ స్వరాజ్యమైదానంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం పిలుపునిచ్చారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కూడా పెద్ద ఎత్తున క్షీరాభిషేకాలు నిర్వహించాలని, ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అంబేడ్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా, సామాజిక సాధికారత వైపు రాష్ట్రాన్ని నడిపించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహనరెడ్డి, బాబాసాహెబ్‌కు ఘనంగా నివాళులర్పిస్తూ ఆ మహనీయుని 206 అడుగుల భారీ విగ్రహాన్ని విజయవాడలో ఆవిష్కరించనున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇదొక మహత్కార్యమని, దీనిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అంబేడ్కర్ భావజాలం కేవలం భారతదేశానికే కాదు, యావత్ ప్రపంచానికి స్ఫూర్తిదాయకమన్నారు. బడుగు, బలహీన వర్గాలకే కాదు సామాజిక సమతుల్యతను, వారి అభ్యున్నతిని కోరుకొనే ప్రతిఒక్కరికీ అంబేడ్కర్ ఆశయాలు శిరోధార్యమని పేర్కొన్నారు.

ఘనంగా కోరుకొండ సైనిక్ స్కూల్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి, అధికారులు, విద్యార్థులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల 62వ అవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు దేశ రక్షణ రంగంలో సుమారు 700 మంది సైనిక అధికారులను అందించిన ఘనత కోరుకొండ సైనిక పాఠశాలకు దక్కడం గర్వకారణమన్నారు. సైనిక పాఠశాలలో విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా నేడు అత్యున్నత స్థాయిలో ఉన్నారని కొనియాడారు. దేశంలో ఉన్న 33 సైనిక పాఠశాలలో కోరుకొండ సైనిక పాఠశాల ముందు వరుసలో నిలవడం ఆనందంగా ఉందని తెలిపారు. సౌకర్యాలు, శిక్షణ పరంగా, ఉత్తమ విద్యాబోధన అందించడంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. భవిష్యత్తులో సైనిక పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న ఓటర్ల తుది జాబితా విడుదల

- జిల్లా పరిశీలకుడు జె.శ్యామలరావు
- ఓటర్ల సవరణ ప్రక్రియపై జిల్లా అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలకుడు జె.శ్యామలరావు

విజయనగరం అర్బన్: ఓటర్ల తుది జాబితాను ఈనెల 22న ప్రచురించి, అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించాలని జిల్లా అధికారులను జిల్లా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలకుడు, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఆదేశించారు. జిల్లాలో ఆయన గురువారం పర్యటించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న సవరణ ప్రక్రియను కలెక్టర్ ముందుగా వివరించారు. వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా పరిశీలకుడు శ్యామలరావు మాట్లాడుతూ సవరణ ప్రక్రియపై నియోజకవర్గాల వారీగా ఆరా తీశారు. ప్రస్తుత పరిస్థితి, రాజకీయ పార్టీల నుంచి అందించిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. వచ్చిన అన్ని ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలుగు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశాలు, అక్కడి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఓటరు జాబితాలను గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీలకు ఇవ్వడంతో పాటు డిజిటల్ కాపీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతీ బీఎల్‌ఓ వద్ద ఓటర్ల జాబితా ఉండాలని, పబ్లికేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఇవ్వాలని శ్యామలరావు స్పష్టంచేశారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్‌త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, డీటీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ సేవలు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధి కార్యాలయాల్లో అందుతున్న సేవలన్నింటినీ భారత ప్రభుత్వ నేషనల్ కెరియర్ సర్వీసెస్ (ఎన్‌ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించినట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్స్, అదనపు అర్హతల నమోదు సులభతీరిన 'ఎంప్లాయిమెంట్.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఫోన్ నంబర్: 96407 60352ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు వడ్డీ రాయితీ రూ.3.01 కోట్లు



లబ్ధిదారులకు వడ్డీరాయితీ మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

- 29,686 మంది లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం
- లబ్ధిదారుల ఖాతాలకు జమచేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- చెక్కు అందజేసిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథక లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. రాష్ట్రంలోని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల ఖాతాలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వడ్డీ రాయితీని గురువారం జమచేశారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, లబ్ధిదారులు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 29,686 మంది లబ్ధిదారులకు రూ.3.01 కోట్ల వడ్డీరాయితీ ప్రయోజనం కలిగిందన్నారు. దీనికి సంబంధించిన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పొదుపు సంఘాల ద్వారా ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.35 వేలను రుణంగా మంజూరు చేస్తోందన్నారు.

ఇళ్లను పూర్తి చేయడానికి లబ్ధిదారులకు ప్రభుత్వం పలు రాయితీను ఇస్తోంద ని తెలిపారు. రూ.లక్షా80వేలతో పాటు ఉచితంగా ఇసుక, తక్కువ ధరలకే సిమెంట్, ఐరన్‌ను సరఫరా చేస్తోందని చెప్పారు. ఇచ్చిన రుణాలకు వడ్డీ రాయితీని కూడా అందజేస్తోందని వెల్లడించారు. ప్రభు త్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. ఇప్పటికే జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించామన్నారు. ఇళ్ల నిర్మాణాల న్నీ పూర్తయితే ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

- నంద్యాలలో జరగనున్న పోటీలకు 24 మంది అర్హత



నంద్యాలలో కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా బాల, బాలికల జట్లు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు పూర్తయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో బుధవారం రాత్రి వరకు నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు తలపడ్డారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలికలకు, 12 మంది బాలురకు జిల్లా జట్టులో స్థానం కల్పించినట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావుదొర, కె.వి.ప్రభావతి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నంద్యాలలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, వ్యాయామ ఉపాధ్యాయుల కె గోపాల్, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, తిరుపతిరావు, శివ పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

పోలీస్ చర్యలతో సజావుగా సంక్రాంతి

- అసాంఘిక కార్యకలాపాలపై కొరడా
- 1915 లీటర్ల సారా ధ్వంసం
- పేకాటలో 239 మందికి పైగా అరెస్ట్
- రూ.8,59,931 నగదు స్వాధీనం
- కోడిపందాలాడుతున్న 59 మందిపై కేసులు
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 130 మంది మందుబాబులు
- ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్‌తో ఇళ్లల్లో దొంగతనాలకు చెక్


కొత్తవలస చిన్నమన్నిపాలెం, వియ్యంపేట శివారులో సారా, బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: ప్రజలకు హాని కలిగించే అసాంఘిక శక్తులను చెక్ పెట్టేందుకు జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన ప్రణాళికలు సత్ఫలితాలనిచ్చాయి. రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగాయి. సంక్రాంతి పండగను జిల్లా ప్రజలు ప్రశాంతవాతావరణంలో సంతోషంగా నిర్వహించుకునేలా చేశాయి. జనవరి ఒకటో తేదీ నుంచి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మందుబాబులపై కొరడా ఝుళిపించించారు. పేకాట శిబిరాలపై దాడులు చేశారు. కోళ్లపందాలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు. ఐఎంఎఫ్‌ఎల్, బెల్లం ఊటలను నాశనం చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పండగను ప్రశాంతంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసి, సఫలీకృతులయ్యారు. పండగరోజుల్లో ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా పోలీసు శాఖ లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్) యాప్ ప్రవేశపెట్టడంతో ఒకటిరెండు చోట్ల తప్పితే దొంగతనాలకు సంబంధించి కేసులు నమోదుకాకపోవడం గమనార్హం.

ఈ నెలలో ఇప్పటివరకు పోలీస్ చర్యలు ఇలా...

- సారా (ఐడి అరాక్)కి సంబంధించి ఐదు కేసులు నమోదుచేసి 65 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊటలు (ఎఫ్‌జె వాష్) 1850 లీటర్లను ధ్వంసం చేశారు.
- ఎక్సైజ్‌కు సంబంధించి 254 కేసులు నమోదు చేసి 250 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఐఎంఎఫ్‌ఎల్ (మద్యం సీసాలు) 1176.84 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు. 12 వాహనాలు సీజ్ చేశారు. పేకాట శిబిరాలపై దాడులు చేసి 20 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. పెట్టీ కేసులు 31 పెట్టారు. 239 మందిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 51 కేసులకు సంబంధించి రూ. 8లక్షల59వేల 931 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిపై కేసులు నమోదుచేశారు. 7 పెట్టీ కేసులు పెట్టారు. 59 మందిని అరెస్టు చేశారు. రూ.76,040 నగదు, 59 కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- జనవరి ఒకటో తేదీ నుంచి సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పర్వదినాల్లో కుటుంబాలతో సరదగా గడపాల్సిన వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై, వారి కుటుంబాల్లో విషాదం లేకుండా చూడాలనే సదుద్దేశంతో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన 269 మందిపై కేసులు నమోదుచేశారు. బహిరంగ మద్యం సేవిస్తున్న 375 మందిపై కేసులు పెట్టడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్టవేయగలిగారు.

నిరంతర నిఘాతో ప్రశాంతంగా పండగ



పోలీస్ శాఖ సమష్టి కృషితో నిరంతర నిఘాతో సంక్రాంతి పండగను ప్రశాంతంగా నిర్వహించుకోగలిగాం. జిల్లా వ్యాప్తంగా సారా, మద్యం అక్రమంగా తరలిస్తున్నవారిపై నిఘాపెంచి అరెస్టు చేశాం. కోడిపందాలు, పేకాట శిబిరాలపై దాడులు విస్తృతం చేయడంతో పాటు బహిరంగంగా మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టడం వల్ల రోడ్డు ప్రమాదాలు సాధ్యమైనంత వరకూ అరికట్టగలిగాం. కుటుంబాలతో పండగ ఆనందంగా నిర్వహించుకునేలా చేయడంలో తమవంతు బాధ్యత నేరవేర్చగలగడం సంతృప్తినిచ్చింది. ఇళ్లకు లాక్ చేసుకుని వెళ్లే వారికి లాక్‌హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా రక్షణ కల్పించడంతో దొంగతనాలు ఆపగలిగాం.

– ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

క్లుప్తంగా

ఆయన మెడలో రోజుకో పార్టీ కండువా

చీపురుపల్లి: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ పార్టీల నాయకులు పార్టీలు, కండువాలు మార్చడం చూస్తుంటాం. అయితే, ఇటీవల జిల్లా స్థాయి అధికారిగా ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తి కొద్ది రోజుల్లో పార్టీ కండువాలు మార్చుతూ జంపింగ్ చేస్తుండడం విడ్డూరంగా ఉందంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని మెరకముడిదాం మండలంలో చినబంటుపల్లి గ్రామానికి చెందిన కోట్ల సుగుణాకరరావు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా 2023 జూలై నెలలో ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం 2023 ఆగస్టులో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి నాదెండ్ల మనోహర్‌ను కలిసి ఆ పార్టీలో చేరారు. సరిగ్గా ఐదు నెలలు నిండక ముందే గురువారం విజయవాడలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోవడం చూసి జనం నవ్వుకుంటున్నారు.

కోళ్ల పందెం రాయుళ్ల అరెస్టు


అరెస్టయిన కోళ్లపందెం రాయుళ్లతో ఎస్ఐ రాజేష్, సిబ్బంది

వేపాడ: మండలంలోని వీలుపర్తి, పాటూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపారు. వీలుపర్తిలో ముగ్గురు, పాటూరులో ఒకరిని పట్టుకుని నాలుగు కోడిపుంజులు, రూ.800 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యవసాయ కూలీ మృతి


ఘటనా స్థలంలో మరణించిన రంగయ్య

పాలకొండ రూరల్: మండలంలోని చిన మంగళాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ ఎన్ని రంగయ్య(65)ను గురువారం రాత్రి పాలకొండ నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఢీకొంది. ఎస్ఐ హేమంత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మృతుడు తన రోజువారీ పనులు ముగించుకుని స్వగ్రామం కాలినడక వెళుతున్నాడు. గోపాలపురం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో బస్సు ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతునికి భార్య వరహాలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతి చెందిన తిరుపతి

సాలూరు: మండలంలోని జీగిరాం గ్రామానికి చెందిన చింతల తిరుపతి(43) మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ వెంకటరమణ గురువారం తెలిపారు. తిరుపతి ఇంటిలోనే కారణం లేకుండా చనిపోయాడని, మృతుడు తల్లి అప్పలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

టెన్నీకాయిట్ విజేత ప్రవల్లిక


ప్రవళ్లికను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

చీపురుపల్లి: ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎం.ప్రవళ్లిక జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన 47వ జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ద్వితీయస్థానం సాధించి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకువచ్చిన ప్రవళ్లికను కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వి.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపల్ డా.రమేష్‌కుమార్, జ్వాలముఖి, ఉపాధ్యాయ సిబ్బంది గురువారం అభినందించారు.

అధ్యాపకులకు పరిశోధనా పత్రాలు తప్పనిసరి

- సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి


మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: ప్రతి అధ్యాపకుడు తప్పనిసరిగా పరిశోధనా పత్రాలు సమర్పించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ... దేశంలో ఉత్తమ నైపుణ్య విద్యలో ప్రత్యేక గుర్తింపు సాధించామన్నారు. నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ విజయ్‌బాబు, డీన్లు పీఎస్వీ రమణారావు, ఎంఎల్ఎన్ ఆచార్యులు, సన్నీ డియోల్, మురళీ, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దొరికితే అప్పగించండి

సీతానగరం: మండలంలోని జోగింపేట గ్రామానికి చెందిన కొప్పర సుబ్బమ్మ పోస్టల్ ఎఫ్‌డీ బాండ్స్‌తో ఉన్న బ్యాగ్‌ను సీతానగరం–జోగింపేట గ్రామాల మధ్య రాష్ట్ర రహదారిలో జారవిడిచింది. పోస్టాఫీస్‌కు వెళ్తూ బ్యాగ్‌ను పోగొట్టుకున్నానని, ఎవరికి దొరికినా అప్పగించాలని పత్రికాముఖంగా వేడుకుంది. బ్యాగ్‌లో ఆధార్‌కార్డు, పాన్ కార్డు, పోస్టాఫీస్‌లో ఎఫ్‌డీ చేసిన 10 బాండ్స్ ఉన్నాయన్నారు. బ్యాగ్ దొరికిన వారు సెల్: 9908811992కు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేస్తానన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో పేకాట శిబిరంపై రేగిడి ఎస్ఐ ఇ.శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది గురువారం దాడిచేశారు. ఐదుగురు జూదారులను అరెస్టుచేయడంతో పాటు రూ.19,860లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్ల పనులకు అనుమతులు జారీచేయండి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురం: ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ రహదారి పనులకు అనుమతులు త్వరితగతిన జారీచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్లతో భూ రికార్డులు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అనుమతులు మంజూరులో జాప్యం చేయడం వల్ల మన్యంలో రోడ్ల పనులు వేగంగా పూర్తిచేయలేకపోతున్నామన్నారు. సమావేశంలో జేసీ గోవిందరావుతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దుబాయి నుంచి మృతదేహం తరలింపు


బంగారునాయుడు (ఫైల్)


విశాఖ విమానశ్రయం వద్ద బంగారునాయుడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటున్న వీఆర్వో, మృతుడి కుటుంబ సభ్యులు

జామి: ఉపాధి కోసం దుబాయి వెళ్లిన జామి గ్రామానికి చెందిన బంగారు నాయుడు(37) గతనెల 30న మృతిచెందాడు. వార్త తెలిసినప్పటి నుంచి మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని మృతుని భార్య కొండమ్మ అధికారులకు విన్నవించుకుంది. తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో దుబాయి నుంచి గురువారం సాయంత్రం విశాఖపట్నం విమానశ్రాయానికి విమానంలో మృతదేహాన్ని తరలించారు. వీఆర్వో హరికృష్ణ, మృతుని కుటుంబ సభ్యులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు విమానాశ్రయానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. జామికి తీసుకొచ్చారు. మృతదేహం అప్పగించేందుకు కృషిచేసిన అధికారులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాడంగి యువతి ప్రతిభ


హేమలత

బాడంగి: సచివాలయ పశుసంవర్ధక సహాయకుల పోస్టుల కోసం ఇటీవల నిర్వహించిన రాత పరీక్షలో బాడంగికి చెందిన మరడ హేమలత రాష్ట్రస్థాయిలో నాలుగోర్యాంకు, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఆమెను తండ్రి సత్యనారాయణతోపాటు స్థానికులు అభినందించారు.

95 కేజీల గంజాయి స్వాధీనం

గజపతినగరం: కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో అక్రమంగా తరలిస్తున్న 95 కేజీల గంజాయిని గజపతినగరం వినాయక టెంపుల్ వద్ద పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు–లింగాలవలస కూడళ్ల వద్ద ఎస్ఐ సూర్యకుమారి సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా ద్విచక్ర వాహనాలపై అక్రమంగా మద్యం తరలిస్తున్న చుక్కరాజు, సి.చంద్రరావు అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

11 మద్యం బాటిళ్లు..

సంతకవిటి: మండల పరిధి శ్రీహరినాయుడుపేట కూడలి దగ్గర గురువారం హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు తన సిబ్బందితో తనిఖీలు చేశారు. పోతులజగ్గుపేట గ్రామానికి చెందిన వ్యక్తినుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు.

జోరుగా ఈ క్రాప్ నమోదు


చాటాయవలసలో మొక్కజొన్న పంట ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రేగిడి: జిల్లాలోని రైతులు రబీలో సాగుచేసిన మొక్కజొన్న పంట వివరాల నమోదు జోరుగా సాగుతోంది. ప్రతీరైతు పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదుకు వ్యవసాయ సిబ్బందికి సహకరించాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు. రేగిడి మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్న అగ్రహారం, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట ఈ–క్రాప్ నమోదును వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు వల్ల పంటను మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని ఏఓ తెలిపారు.

వైన్‌షాపు సిబ్బంది చేతివాటం

- రూ.2.09 లక్షలు గల్లంతైనట్లు గుర్తించిన ఎక్సైజ్ అధికారులు


వైన్ షాపులో సోదాలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సిబ్బంది చేతివాటం చేసినట్లు గుర్తించామని పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ సి.మధుబాబు తెలిపారు. ఈ షాపుపై (నంబర్ 01187) తరచూ ఫిర్యాదులు వస్తుండడంతో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో 1194 మద్య సీసాలు మాయం అయినట్లు గుర్తించామన్నారు. మద్య సీసాలకు సంబంధించి రూ.2.09 లక్షల నగదుపై సిబ్బందిని ప్రశ్నించినట్లు చెప్పారు. లెక్కల్లో తేడాలు ఉండడంతో ఈ మొత్తాన్ని షాపులో పనిచేస్తున్న సిబ్బంది నుంచి రికవరీ చేశామన్నారు. ఈ వైన్‌షాపు నిర్వహణ వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొద్ది రోజుల్లో వేరే చోటుకు మారుస్తామన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో రెండు కేటగిరీల్లో ఖాళీల భర్తీకి సంబంధించిన రివైజ్‌డ్ ప్రొవిజనల్ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ హెల్పర్, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టులకు సంబంధించి రివైజ్‌డ్ ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ పొందుపరిచినట్టు చెప్పారు. అభ్యంతరాలు ఉంటే 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ప్రభుత్వ వైద్య కళాశాలలో తెలియజేయాలన్నారు. ఎలక్ట్రీషియన్, ఆఫీస్ సబార్డినేట్, స్టోర్ అటెండర్ పోస్టులకు స్పీకింగ్ ఆర్డర్స్ వివరాలు కూడా వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ప్రజా సంక్షేమంతోనే దేశాభివృద్ధి

- రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నర్సింహారావు


మట్లాడుతున్న జి.వి.ఎల్.నర్సింహారావు

కొత్తవలస: ప్రజా సంక్షేమంతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నర్సింహారావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హతకలిగిన ప్రతిఒక్కరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.పద్మజ, ఈఓపీఆర్‌డీ కర్రి ధర్మారావు, సర్పంచ్ విరోతి కొండలరావు, ఉప సర్పంచ్ అద్దూరి సతీష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షురాలు చొక్కాకుల జగదీశ్వరి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

175/175 సీట్ల గెలుపే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ
- ఈ నెల 25న భీమిలిలో బహిరంగ సభ
- సభ నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో సమావేశం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్

సాక్షి, విశాఖపట్నం : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభ నిర్వహణపై గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో గురువారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభకానుందని, ఇందులో భాగంగా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ దద్దరిల్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు సభకు తరలిరావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదు జోన్లగా విభజించామని.. సీఎం జగన్ అధ్యక్షతన అన్ని జోన్లలో కేడర్‌తో సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ భేటీలు జరుగుతాయని వెల్లడించారు. తొలి బహిరంగ సభ ద్వారా ఉత్తరాంధ్ర కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉత్తరాంధ్రపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ఈ ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు వివరించారు. ఎవరికి ఎమ్మెల్యే.. ఎవరికి ఎంపీ టికెట్ ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్సు రామారావు, ఇందుకూరి రఘురామరాజు, సురేష్‌బాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్‌కుమార్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, విశ్వసరాయి కళావతి, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, పిరియా విజయ, డాక్టర్ తాలే రాజేష్, మత్సరాస విశ్వేశ్వరరాజు, ఉరుకూటి రామచంద్రరావు, మలసాల భరత్‌కుమార్, ముఖ్య నాయకులు సుకుమార్‌వర్మ, ఈర్లె అనురాధ, తమ్మినేని చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.